ధర్మారం.. అభివృద్ధికి దూరం



చెరువులోకి వెళ్లే మురుగునీటి కాలువ



డ్రైనేజీ లేక రోడ్డుపై వస్తున్న మురుగునీరు

- మున్సిపల్‌లో విలీనమైనా నిధుల కేటాయింపుపై చిన్నచూపు
- తాగునీరు, డ్రైనేజీ లేక ప్రజల ఇబ్బందులు
- చెరువులోకి చేరుతున్న మురుగునీరు

జమ్మికుంట: విలీన గ్రామాలపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. నిధులు లేక ఆయా గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉంటున్నాయి. జమ్మికుంట మున్సిపల్‌లో ధర్మారం, కొత్తపల్లి, రామన్నపల్లి గ్రామాలను విలీనం చేసి నాలుగేళ్లు గడుస్తుంది. ఆయా గ్రామాలను మున్సిపల్‌లో విలీనం చేయొద్దని ప్రజాప్రతినిధులు, ప్రజలు వ్యతిరేకించినా.. పట్టణంతోపాటు మెరుగైన అభివృద్ధి, సకల సౌకర్యాలు కల్పిస్తామని హామీతో విలీన ప్రక్రియ ముగించారు. కాగా ధర్మారం గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకుండా పాలకవర్గం, అధికారులు చిన్నచూపు చూస్తున్నారని, అభివృద్ధికి నోచుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ధర్మారం గ్రామపంచాయతీ మిగులు నిధులు స్వాధీనం చేసుకొని కనీస వసతులు కల్పించలేదని, తాగునీరు, డ్రైనేజీ నిర్మాణాలకు నిధులు కేటాయించడం లేదని, సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టింపులేని పాలకవర్గం, అధికారులు

జమ్మికుంట మున్సిపల్‌లో విలీనమైన ధర్మారం గ్రామాన్ని 1, 2వ వార్డుగా ఏర్పాటు చేశారు. గ్రామంలో మిషన్ భగీరథ పైపు లైన్ ద్వారా తాగునీరు, ప్రధాన రోడ్డుపై డ్రైనేజీలు లేవు. పట్టణ ప్రగతిలో మొదటి ప్రాధాన్యతగా సమస్యలు గుర్తించలేదనే ఆరోపణలున్నాయి. 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న ధర్మారం వార్డు పరిధి రామాపురంలోని ఇళ్లకు మిషన్ భగీరథ నీరు అందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సౌకర్యాల కల్పనపై పాలకవర్గం, అధికారులకు స్థానిక కౌన్సిలర్ పలుసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ప్రతిపాదించి అమలు చేస్తున్న పట్టణ ప్రగతి లక్ష్యాన్ని నీరుగార్చుతున్నారు.

సమస్యలు ఇలా..

- మిషన్ భగీరథ పైపు లైన్, నల్లా కనెక్షన్‌లు లేవు
- ధర్మారంలోని వావిలాల–జమ్మికుంట ప్రధాన రోడ్డు వెంట లైటింగ్, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలి.
- మున్సిపాలిటీలోని కొత్తపల్లి మురుగునీరు ధర్మారం చెరువులోకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది.
- మురుగునీరు చెరువులో చేరి చేపలు చనిపోతున్నాయి. రైతుల పొలాల మీదుగా మురుగునీరు పారుతుండడంతో పంటలు వేసుకోలేకపోతున్నారు.
- శ్మశానవాటిక లేక ప్రజలు 8 కిలోమీటర్ల దూరం ఉన్న మున్సిపల్ శ్మశానవాటికకు మృతదేహాలను తీసుకెళ్తున్నారు.
- ఓపెన్ జిమ్, జంక్షన్ నిర్మాణాలు చేపట్టాలి.

మున్సిపాలిటీలోని 1, 2వ వార్డుల (ధర్మారం గ్రామం) వివరాలు	
జనాభా	ఓటర్లు
4,000	2,200
గృహాలు	2,500

చేపలు చనిపోతున్నాయి



మున్సిపల్‌లోని కొత్తపల్లి నుంచి డ్రైనేజీ నీరు చెరువులోకి వస్తుంది. చేపపిల్లలు చనిపోవడంతో ముదిరాజు కులస్తులం ఆర్థికంగా నష్టపోతున్నాం. గ్రామానికి నీటి సరఫరా చేసే బావి చెరువులో ఉంది. మురుగునీరు రాకుండా ప్రత్యామ్నాయంగా డ్రైనేజీ నిర్మించి దారి మళ్లించాలి.

– పోలు వెంకటేశ్, ముదిరాజు సంఘం నాయకుడు, ధర్మారం

నిధులు కేటాయించాలి



విలీన గ్రామం ధర్మారం గ్రామపంచాయతీ మిగులు నిధులు రూ.38 లక్షలు మున్సిపల్‌లో కలుపుకున్నారు. పట్టణ ప్రగతిలో నిధులు కేటాయించ లేదు. ప్రధానమైన సమస్యల పరిష్కారానికి, కనీస వసతులకు నిధులు కేటాయించాలి.

– బొంగోని వీరన్న, ధర్మారం 1వ వార్డు కౌన్సిలర్, జమ్మికుంట

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు పరిశీలించి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు అందిస్తాం. అమృత పథకం ద్వారా నిధులు మంజూరయ్యాయి. తాగునీటి పైపులైన్, నల్లా కనెక్షన్‌లు త్వరలో పూర్తి చేస్తాం. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

– బి.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, జమ్మికుంట

క్లుప్తంగా

రెగ్యులర్ ఉత్తర్వులు అందజేత



రెగ్యులర్ ఉత్తర్వులు అందిస్తున్న ఎంపీడీవో

మానకొండూర్‌రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న 8 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను మంగళవారం కలెక్టర్ గోపి రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో, జిల్లా ఎంపీడీవోల సంఘం అధ్యక్షుడు దివ్యదర్శన్‌రావు కార్యదర్శులకు రెగ్యులర్ ఉత్తర్వు పత్రాలను అందజేశారు. రెగ్యులర్ ఉత్తర్వులు పొందినవారిలో పవన్‌కుమార్– లలితాపూర్, రాకేశ్– లక్ష్మీపూర్, ప్రేమ్‌కుమార్– జగ్గయ్యపల్లి, దీపక్– మద్దికుంట, అమృతవర్షిణి– పచ్చునూర్, స్వప్న– పెద్దూర్‌పల్లి, శ్వేత– దేవంపల్లి, ప్రసన్న– శంశాబాద్ ఉన్నారు.

గులాబీ పురుగు నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బీసీఐ సహాయకులు

జమ్మికుంట: మండలంలోని గండ్రపల్లి గ్రామంలో కేశవపూర్ ఎఫ్‌పీసీ(ఫార్మర్ ప్రొడ్యూజర్ కంపనీ) సహకారంతో బీసీఐ (బెటర్ కాటన్ ఇన్‌స్టిట్యూట్) పత్తి ప్రాజెక్టు ద్వారా రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతు సదుపాయకర్తలు మోహన్, రాకేశ్ మాట్లాడుతూ, గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు పెట్టుకోవాలని, వేపనూనే పిచికారీ చేసుకోవాలని సూచించారు. పత్తి చేను చుట్టూ కంది, అంతర పంటలు వేసుకోవాలన్నారు. అకాల వర్షాలతో చేనులో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, సూక్ష్మ పోషకాలు ఉన్న మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీఐ క్షేత్ర సహాయకుడు అనిల్, సర్పంచ్ పద్మసమ్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదుపై విస్తృత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న వేణుగోపాల్

హుజూరాబాద్: నూతన ఓటరు నమోదు, ఓటర్ జాబితా సవరణకు వచ్చిన అవకాశాన్ని నేటి యువత సద్వినియోగం చేసుకోవాలని హుజూరాబాద్‌కు చెందిన రాష్ట్ర ఉత్తమ సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు నమోదు తో పాటు ఓటరు జాబితాలో సవరణలపై ప్రజలను చైతన్యపరిచేలా వివరించినట్లు తెలిపారు. నూతన ఓటరు నమోదుకు ఈ నెలాఖరు వరకు అవకాశం ఉందని అర్హులైన యువతీ యువకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫారాలు నింపి ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

పేద విద్యార్థిని పేరిట ఎల్‌ఐసీ పాలసీ



రమ్యకు పాలసీ బాండ్ అందిస్తున్న రాజు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన ముత్యం అశోక్ కుమార్తె రమ్య (3వ తరగతి)కు దాతల సాయంతో రూ.24వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ సింగిల్ ప్రీమియం ఎండోమెంట్ ప్లాన్ ఎల్ఐసీ పాలసీని ముదిరాజ్ సంఘం నాయకుడు మామిడి రాజు ఆధ్వర్యంలో చేశారు. చిన్నారి కుటుంబం దీనస్థితిని గమనించిన తోటి స్నేహితులు, దాతలు స్పందించి ఆర్థికచేయూతనందించారు. ఈసందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

చొప్పదండి: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట మంగళవారం మున్సిపల్ కార్మికులు నిరసన చేపట్టారు. సీఐటీయూ పిలుపు మేరకు పనికి తగిన వేతనం ఇవ్వాలని, తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. గంట పాటు నిరసన వ్యక్తం చేసి క్యాంపు కార్యాలయం గేటుకు వినతి పత్రం తగిలించి వెళ్లిపోయారు. మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు వడ్లూరి అంజయ్య ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో కార్మికులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకిషన్

శంకరపట్నం: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉమ్మెంతల సరోజన అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని కళ్యాణలక్ష్మి, శాదీముబారక్ తదితర పథకాలను అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ అన్నారు. గ్రామాలలో చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. కాగా విద్యుత్, మిషన్‌భగీరథ నీటి సరఫరాపై సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీవాణి, తహసీల్దార్ అనుపమ, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డు ఆవిష్కరణ

ఆరోగ్యశ్రీ డిజిటల్‌కార్డు కరపత్రాన్ని మంగళవారం మండలకేంద్రంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ విడుదల చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ పరిమితిని ప్రభుత్వం రూ.5లక్షలకు పెంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కామన్‌సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మానగర్‌కు రూ.30 లక్షల నిధులు



ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న ఎంపీపీ కేతిరెడ్డి వనిత

తిమ్మాపూర్: మహాత్మానగర్ గ్రామ పంచాయతీకి రూ.30 లక్షల అభివృద్ధి నిధులు మంజూరయ్యాయి. స్థానిక పంచాయతీ కార్యాలయంలో రూ.30 లక్షల పనుల ప్రొసీడింగ్ కాపీని ఎంపీపీ కేతిరెడ్డి వనిత సర్పంచ్, పాలకవర్గానికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జక్కని శ్రీవాణి మాట్లాడుతూ, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఎంపీపీ కేతిరెడ్డి వనిత సహకారంతో నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడి అనతి కాలంలోనే జిల్లాలోనే మహాత్మానగర్ అభివృద్ధిలో ముందంజలో నిలిచిందన్నారు. అనంతరం అభివృద్ధి నిధుల ప్రొసీడింగ్స్ అందించిన ఎంపీపీని పాలకవర్గం సత్కరించింది. ఉప సర్పంచ్ మడుపు శ్రీనివాస్‌రెడ్డి, వార్డు స భ్యులు అడిచెర్ల లక్ష్మి సత్యనారాయణ, ఎర్రం సాగర్, గూడ తిరుపతి, ఎడ్ల వెంకట్‌రెడ్డి, మాశెట్టి మౌనిక శివకృష్ణ, మాతంగి పరమేశ్వరి రవీందర్, కో ఆప్షన్ సభ్యులు మన్నే జయచందర్, కేతిరెడ్డి ఎల్లారెడ్డి, తేజ శ్రీ, నాయకులు రాచపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రం అందజేస్తున్న కవ్వంపల్లి

గన్నేరువరం: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన కొమ్మెర రవీందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ నియామక ఉత్తర్వులను మంగళవారం రవీందర్‌రెడ్డికి అందజేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు సత్యనారాయణ, మండల అధ్యక్షుడుతో పాటు నాయకులు, కార్యకర్తలకు రవీందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల ఆరోగ్యం ఇంటికి సౌభాగ్యం

- ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కౌశిక్‌రెడ్డి తదితరులు

ఇల్లందకుంట: మహిళా ఆరోగ్యం ఇంటికి సౌభాగ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్య మహిళా కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలు ఆరోగ్యంగా ఉండాలని సీఎం కేసీఆర్ ప్రతీ మంగళవారం ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య పరీక్షలు ఏర్పాటు చేశారని, ఈ అవకాశాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జమ్మికుంట ఆసుపత్రిని 30 పడకల నుంచి 100 పడకలుగా మారుస్తానని పేర్కొన్నారు. ఏడుసార్లు ఈటలకు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారని, కేవలం ఒక్కసారి తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని సిద్దిపేట, సిరిసిల్లగా అభివృద్ధి చేస్తానని వివరించారు. అంతకుముందు శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు స్వామివారి జ్ఞాపికను కౌశిక్‌రెడ్డికి అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పావని వెంకటేష్, సర్పంచ్ శ్రీలత, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటల పరిశీలన



అంకాపూర్ ఉప సర్పచ్‌తో రైతులు

జమ్మికుంట: నిజామాబాద్ జిల్లా అంకాపూర్ గ్రామంలో వాణిజ్య పంటలను మంగళవారం స్థానిక రైతులు పరిశీలించారు. కొత్త వ్యవసాయ విధానాలు పాటిస్తున్న పద్ధతులపై అవగాహనకు జమ్మికుంట మున్సిపల్ పరిధి ధర్మారం 2వ వార్డు కౌన్సిలర్ మారపల్లి బిక్షపతి ఆధ్వర్యంలో సందర్శించారు. ఈసందర్భంగా వాణిజ్య పంటలు, పంట మార్పిడి, నిల్వ చేసుకునే విధానంపై అంకాపూర్ గ్రామ ఉప సర్పంచ్ మాచర్ల కిషన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రైతులు వీరస్వామి, రవి, జనార్దన్, రాజు, మొగిలయ్య, పోశయ్య, అంజి, లక్ష్మి, సులోచన, రజిత, విజయ, మరియా పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్ష శిబిరానికి స్పందన



శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

హుజూరాబాద్: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ కంటి వెలుగు ఆధ్వర్యంలో మంగళవారం హుజూరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్ష శిబిరానికి స్పందన లభించింది. శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక ప్రారంభించారు. 112 మందికి పరీక్షలు నిర్వహించగా 19 మందికి శుక్లాలను గుర్తించి వారికి ఉచిత కంటి ఆపరేషన్ చేయిస్తామని, ఏడుగురికి టి్రిజియం ఆపరేషన్ నిమిత్తం ప్రత్యేక వాహనంలో ఉచితంగా శరత్ ఐ హాస్పిటల్ హనుమకొండకు తరలించామని కంటి పరీక్ష నిపుణుడు, క్లబ్ సెక్రటరీ తిప్పారపు శ్రీనివాస్ తెలిపారు. ఉచిత శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను చైర్‌పర్సన్ అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనలో విఫలం

హుజూరాబాద్: ఉద్యోగ, ఉపాధి కల్పన, నిరుద్యోగ భృతి ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన డీవైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగ నోటిఫికేషన్ ఇస్తూ ఆన్‌లైన్ పేరుతో గతంలో రూ.200 ఉంటే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,000 పెంచి అడ్డగోలుగా వసూలు చేస్తూ యువతను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులకు నిరుద్యోగభృతి ఇస్తామని అసెంబ్లీలో బడ్జెట్ కేటాయించి ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో వంశీ, అఖిల్, సాయి, రాజ్‌కుమార్, విజయ్, వంశీధర్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

శంకరపట్నం: మండలంలోని కన్నపూర్– ధర్మారం ప్రాంతంలోని శ్రీవాలీసుగ్రీవ ఆంజనేయ రామాలయంలో శ్రావణమాసం చివరి మంగళవారం సందర్భంగా ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పురోహితులు మధుసూదనాచార్యులు, గురుస్వామి సదానందాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. రాజ మౌళి, సర్పంచ్ వెంకటరమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


హనుమాన్ ఆలయంలో అన్నదానం

చొప్పదండి: శ్రావణమాసం పురస్కరించుకొని పట్టణంలోని పోచమ్మగుడి వద్ద గల శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ ఆవరణలో సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వెంకన్న, గోపాల్, చంద్రయ్య, రవి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు కోండ్ర సంపత్ ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం అతడిని వేగురుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ జంగా భరత్‌గాంధీరెడ్డి పరామర్శించారు. అనంతరం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన చెక్‌డ్యాం



కొట్టుకుపోయిన చెక్‌డ్యాం

మానకొండూర్‌రూరల్: ఇటీవల వర్షాలకు శ్రీనివాస్‌నగర్ గ్రామ శివారులోని మానేరు తీరంలో నిర్మించిన మినీ చెక్‌డ్యాం వరద ఉధృతికి కొట్టుకుపోయింది. కొద్ది నెలలక్రితం చెక్‌డ్యాం నిర్మించారు. ఇటీవల మానేర్ డ్యాం నీటిని వదలడంతో కొంత మేరకు చెక్‌డ్యాం కొట్టుకు పోయింది. నాసిరకంగా పనులు చేపట్టడంతోనే చెక్‌డ్యాం కొట్టుకుపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్కారు బడా.. పశువుల దొడ్డా..



వీణవంక: మండలంలోని మల్లన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పశువులకు అడ్డాగా మారింది. ఇక్కడ 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. తరగతి అదనపు గదుల్లో కొందరు రైతులు పశువులను కట్టేస్తున్నారు. దీంతో పాఠశాల ఆవరణ దుర్వాసన వస్తుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు, పాలకవర్గం స్పందించి తరగతి గదులను శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పర్మినెంట్ చేయాలని వినతి

హుజూరాబాద్: మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరుతూ మంగళవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కార్మికులకు రూ.21 వేల వేతనం ఇస్తున్నట్టు తమకూ ఇవ్వాలని దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అధ్యక్షుడు ఎండీ అజ్జు, ప్రధాన కార్యదర్శి తూముల కుమారస్వామి, ఉపాధ్యక్షురాలు సరోజన, క్రాంతికుమార్, రాజమౌళి, సమ్మక్క, రాజేష్, రాజేశ్వరి, రాజ్‌కుమార్, చిరంజీవి, వీరస్వామి, బిక్షపతి, రామగిరి సులోచన, ఐలయ్య, గుడ్డేలుగుల శ్రీనివాస్, పోగుల జయ, మిడిదొడ్డి సుశీల, రొంటాల మహేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెరిగింది

- చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

రామడుగు: తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలతో ప్రభుత్వ వైద్యశాలలపై ప్రజలకు పూర్తి నమ్మకం కలిగిందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మంగళవారం రామడుగు మండలం గుండిగోపాల్‌రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమంలో ప్రత్యేకంగా వైద్యపరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇయ్యూనైజేషన్ అధికారి జువీదా, గోపాల్‌రావుపేట వైద్యాధికారి గ్రీష్మమన్య, ఎంపీపీ కలిగేటి కవితలక్ష్మన్, సర్పంచ్ కర్ర సత్యప్రసన్న, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాడ ప్రభాకర్‌రెడ్డి, కొండగట్టు ఆలయ పాలకవర్గ సభ్యుడు దాసరి రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం

గంగాధర: మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని ఓ ఫంక్షన్ హాలులో మైనార్టీ మహిళలకు ప్రభుత్వం మంజూరు చేసిన కుట్టుమిషన్లను పంపిణీ చేసి మాట్లాడారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికంగా ఎదగాలి


- ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

సైదాపూర్: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో మండల కేంద్రంలో నందిని గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన శివాని హోమ్ ఫుడ్స్‌ను ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం సైదాపూర్ ఎంపీడీవో ఆఫీసులో 33 స్పోర్ట్స్ కిట్‌లను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళా సంఘాలు మహిళల ఆర్థిక సాధికారికతకు కృషి చేస్తున్నాయని, మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు నిర్మించుకున్నామని, గ్రామీణ ప్రాంత యువతకు క్రీడల కోసం అన్ని రకాల క్రీడావస్తువులు ప్రభుత్వం అందజేస్తుందని వాటిని వినియోగించుకొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో పద్మావతి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పీపుల్స్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

హుజూరాబాద్: పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించేవారు దరఖాస్తు చేసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పోతులూరి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా 119 స్థానాల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉందని వివరించారు. అయితే నియోజకవర్గాల వారీగా టికెట్ ఆశించే వారు స్థానిక హుజూరాబాద్ పార్టీ కార్యాలయంలో వారి వివరాలను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం రఘు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ, రాష్ట్ర సహాయక కార్యదర్శి సందేళ్ల వెంకన్న, రాష్ట్ర ఈసీ మెంబర్లు రమేష్, కాటిక రవి, రమేష్, జిల్లా అధ్యక్షుడు తిప్పారపు గోపి, జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.